ప్రజాశక్తి
బుధవారం 25-12-2013



హైదరాబాద్

# యశోద ఆస్పత్రిలో గుండె మార్పిడి చికిత్స విజయవంతం

ప్రజాశక్తి–హైదరాబాద్‌బ్యూరో

యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ గుండె మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి అరుదైన ఘనతను సాధించింది. చిన్న వయస్కురాలైన ఓ మహిళకు గుండె మార్పిడి చేసి కేవలం పది గంటల్లోనే ఆమెను మాట్లాడేలా చేశారు. ఈ చికిత్స ద్వారా తాము ప్రపంచస్థాయి వైద్య సేవలకు ఏమాత్రమూ తీసిపోలేమని యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ జి.యస్.రావు పేర్కొన్నారు. మంగళవారం సికింద్రాబాద్ యశోద హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ శస్త్ర చికిత్సకు నేతృత్వం వహించిన యశోద హాస్పిటల్ ఛీఫ్ కార్డియోథొరాసిక్, ట్రాన్స్‌ప్లాంట్, మినిమల్ యాక్సిస్ సర్జన్ డాక్టర్ ఎ.జి.కె. గోఖలేతో కలిసి ఆయన వెల్లడించారు.

తూర్పుగోదావరి జిల్లా పిఠాపురానికి చెందిన వెంకటరమ్య(25) ఏడేళ్లక్రితం ఓ బిడ్డకు జన్మనిచ్చింది, అయితే ఆమె గర్భవతిగా ఉన్నప్పుడు గుండె సమస్య మొదలయ్యిందని తెలిపారు. ప్రసవానంతరం ఈ సమస్య మరింత తీవ్రంగా మారిందన్నారు. దీనివల్ల ఆమె నడిచే సమయంలో ఊపిరి పీల్చుకోలేని, పడుకోలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. కాకినాడలోని కార్డియాలజిస్టు రమ్యను డాక్టర్ గోఖలేను సంప్రదించాలని సూచించారని తెలిపారు. రెండు నెలల క్రితం రమ్య యశోద హాస్పిటల్ చీఫ్ కార్డియోథొరాసిక్ ట్రాన్స్‌ప్లాంట్, మినమల్ యాక్సిస్ సర్జన్ డాక్టర్ ఎ.జి.కె. గోఖలేను సంప్రదించారని. అనంతరం డాక్టర్ గోఖలే, కార్డియాలజిస్టు డాక్టర్ రాజశేఖర్ ఆమెకు వివిధ పరీక్షలు నిర్వహించి, గుండె మార్పిడితోనే ఆమెను బాగు చేయగలమని నిర్ధారణకు వచ్చారని వివరించారు. ఈ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జి.ఎస్ రావు

విషయమై వారి కుటుంబ సభ్యులకు రెండు నెలలపాటు కౌన్సిలింగ్ నిర్వహించి వారిని ఒప్పించగలిగారని తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 15వ తేదీన 21 సంవత్సరాల వయసున్న వ్యక్తి ప్రమాదానికి లోనై నగరంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో బ్రెయిన్‌డెడ్‌గా పరిగణించారన్న సమాచారం అందుకున్న జీవన్‌ధాన్ ప్రముఖులు ఈ విషయాన్ని యశోద హాస్పిటల్‌కు తెలిపారన్నారు.

యశోద హాస్పిటల్ వైద్యులు అతని గుండెను వెంటనే రమ్యకు అమర్చేందుకు సన్నాహాలు చేశారన్నారు. అంతా పకడ్బందీగా ఏర్పాటు చేసుకున్న వైద్యులు పోలీస్ ఎస్కార్ట్ సహాయంతో కేవలం పది నిమిషాల్లోనే గుండెను తీసుకొచ్చి రమ్యకు అమర్చారన్నారు. ఈ శస్త్ర చికిత్సలో డాక్టర్ విశ్వనాథ్, డాక్టర్ దిలీప్ రాఠి, డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ సుధాకర్, డాక్టర్ సాయిచంద్ర పాల్గొని కేవలం రెండు గంటల్లోనే చికిత్స పూర్తి చేశారని తెలిపారు.